


**మాలీ,** మాలినీ కలకు చేతులతో పాదులో చేస్తున్నారు. ఎక్కడో దూరంగా నీళ్ళు పారుతున్న గలగల—అరిటాకుల మీద సర్వ సాక్షి వెండి మెరుపు. రెండు రోజుల ముందు కురిసిన వాన తోట సంతటినీ—చెట్లనూ, మొక్కలనూ కడిగి పచ్చగా వెలిగిస్తున్నది.

వాడు వాళ్ళ దగ్గర నుండి కదిలి నెమ్మదిగా సాగి అక్కడ ఆగాడు.

చల్ల గాలికి తల వూచింది మొక్క. పాకేందుకు ప్రయత్నిస్తూ చేతులు తప తప కొడుతూ బోసి నోటితో కేరింతలు కొట్టే పసిపాపలా మొగ్గ ఆనందంగా వూగింది

ఒక క్షణం దాన్ని చూశాడు. పుటుక్కున తెంపాడు వాడు! ముక్కు దగ్గర పెట్టుకున్నాడు వాడు!

"ఏయ్! ఎందు క్కోశావ్?" అడిగాడు మనిషి.

"ఏం కోస్తే?" అన్నాడు వాడు.

"అది నా పువ్వు!" అన్నాడు మనిషి.

"పువ్వు నీ దేంటి, నా దేంటి?" అని నవ్వాడు వాడు.

మనిషికి మనిషి కొచ్చినంత కోపం వచ్చింది. కానీ, మనిషి కదా! వాడు మనిషి కళ్ళల్లోకి చూస్తూ, "ఇంకెన్ని లేవు—కావలిసినన్ని కోసుకో!" అన్నాడు.

"అన్ని పూలూ నావి కావు. పైగా అది మొగ్గ! ఎవ ర్నడిగి కోశావు?" అడిగాడు మనిషి.

"మాలీ, మాలినీ కోసుకోమన్నారు!"

"నా మొగ్గ! రేపు పూవయేది! నిన్ను కోసుకో మన్నారా—ఎలా అన్నారు? ఎందు కంటారు?" అంటూ మనిషి కొంచెం ముందుకు వాడికి దగ్గరగా వెళ్ళాడు.

వాడు జంకాడు. అసలైన మగాడు కాదుగా—అందుకని! కొడతాడేమోనని భయ పడుతున్నాడు.

"రేపటి పువ్వు జాలిగా మెడ వంచి మనిషి కేసి చూస్తూంది. సిగ్గు పడుతూంది. మనిషి ఎందుకు తన గురించి పోట్లాడుతువ్నాడు!? ఆశ్చర్య పడుతూంది. మనిషి 'నా మొగ్గ. నా పువ్వు' అన్నందుక గుండె మంచు వరస్సు అయి రేకుల చివర్ల చెమర్చింది.

"ఎందుకు భయ పడుతున్నావ్?" వాడిని మనిషి అడిగాడు.

"కొడతావా?" నంగిరి నంగిరిగా అన్నాడు వాడు.


"కొట్టను! మరీ అంత పిరికేం? పైకేమో పోజు! ఎగరేసిన కాలరూ, తీసేసిన గుండీ, చేతికి కడియమూ...వెధవ వేషం!" మనిషి వాడి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు.

"పొరపాటై పోయింది" అనబోయి, నక్కలు కూడా మానవుడికి ముందు బహుశా కోతులకు పూర్వీకులు కనక తాతల బుద్ధులు మనుమలు తెచ్చుకోవచ్చని 'మాలీ. మాలినీ' అని గొణిగాడు.

"వాళ్ళకు ఏ పువ్వు ఎవరిదో తెలియదు. నీళ్ళు పోస్తారు. పాదులు చేస్తారు. ప్రేమగా పెంచుతారే కానీ, ఏ పువ్వు ఎవరిదో తెలియదు!" వాళ్ళమీద దయ కురుస్తూ అన్నాడు మనిషి. కొంచెం పుంజు కున్నాడు మగ నక్క!

# ఇది నా పువ్వు

డా. పరుచూరి రాజారాం




"పెంచిన వాళ్ళకు కాక నీకు తెలుసా?"

మాలి మాలినీ మందంగా ఉన్నారు. మనిషిని జో కొడదామని—"చాలా మొగ్గలున్నాయ్, బాబూ! చాలా పూలూ ఉన్నాయ్...కోసుకోండి!" అన్నారు.

మనిషి నిర్విణ్ణుడై చూశాడు.

వాడి కేసి చూస్తూ, "వీళ్ళకు పెంచిన మమకారం కూడా లేదేం?" అన్నాడు.

వాడి కెంతో ఆనందమైంది!

మాలీ, మాలినీ తన వేపే ఉన్నారు. తోట మాటాడదు. సర్వసాక్షి మేని.

ఇంకేం కావాలి?

మొగ్గ కెంతో వేదన. రేపటి పూవుకి ఎంతో ఆవేదన. తానేమీ చెప్పలేదు. అవును! మాలికీ, మాలినికీ మమకారం ఉంటే అలా కర్కశంగా చిదిమేయ నిచ్చేవారా? కానీ పాపం. ఎండనక వాననక, పగలనక రేయనక తనను సాకారే! ఎందుకు?

తాను ఈ లోకంలోకి కళ్ళు తెరిచేందుకు వాళ్ళు కన్ను మూయకుండా కాపాడారే! ఎందు కిలా చిదిమేయ విచ్చారు? ఎందుకు? ఎందుకు?

వాడి పుర్ఘ బాధగా ఉంది. మనిషి కేసి జాలిగా చూసింది. ముందు మవ్వే వాళ్ళ నడిగి కోసేయక పోయావా అన్నట్లు చూసింది. మనిషి దయగా, ప్రేమగా, ఆర్ద్రంగా తన గుండెలు పిండుకుని పూలన్నింటి గుండెలూ పిండుతున్నట్లుగా చూశాడు.

ఆ చూపుకి—

కొన్ని గిలగిల లాడి రెక్కలు రాల్చాయి. మరి కొన్ని రేకుల చివర్న మంచును చెమర్చి బొట్లో తేనెల్ని పూరించాయి.

"ఎలాగూ రాలిపోతాం! నీ సాన్నిధ్యం ఇంతకంటే దొరకదేమో! అందుకే నీ బాధ లోనే తుషారాన్ని ప్రతిఫలించి, మధువు ప్రసవించి, ద్రవించి మరి ముగించేస్తాం. ఇంతకన్న నీ అనుభవం మాకే మొస్తుంది? మా పుర్ఘ నీకే మొస్తుంది?" అంటూ ప్రేమగా, బాధగా, ఆర్తిగా తల లూపాయి.

పీచిన కమ్మ తెమ్మెరను ఆసరా చేసుకుని అతణ్ణే తాకేందుకు ముందు ముందుకి వంగాయి.

మొగ్గ వాడి వేలిలోంచి అందరి వంకా, అన్నింటి వంకా చూసింది.

గాలి సడ్డు పెట్టుకుని పూగిపోయి, స్పృశించి ఆ తృప్తితో జీవితం ముగించేందుకు అందరికీ వచ్చిన ఈ అవకాశంకూడా తనకు రాలేదు. తనకు మనిషి దక్కలేదు. మనిషికి తాను దక్కలేదు.

వీళ్ళకు పెంచిన మమకారంకూడా లేదే—అన్న మనిషిని జాలి గుండె అని పక్క బుద్ధితో, చతుష్పాత్తుం అతీంద్రియ జ్ఞానంతో, మనిషి మనస్తత్వాన్ని పీల్చుకున్నాడు వాడు. జ్ఞానబోధ మొదలెట్టాడు వాడు. బైబిల్‌లోంచి, పురాణాల్లోంచి వేదాల్లోంచి, మనుస్మృతిలోంచి...వాళ్ళు వాళ్ళు మాట్లాడుతున్నట్లుగా, వేత్తలా మాట్లాడాడు... చివరకు—

"సాటి మగాడివి! ఒక్క పువ్వు కోసుకో నివ్వవా? నీ దేం న్యాయం? ఎన్ని కావాలంటే అన్ని ఉన్నాయి కదా? ఏమిటా స్వార్థం? అయినా పూలు దేనికి? ఆఘ్రాణించడానికి కాదా? అందమైన పూలు... వాసన విచ్చే పూలు."

మనిషి నీరైపోయాడు. వాడి వాగ్ధాటి ఆగలేదు.

"పెంచిన వాళ్ళకి మమకారం లేదా? అంటే నీ కంతకన్న ఎక్కువ ప్రేమ ఉందా? నీలాంటి వాళ్ళే నిజమైన ద్రోహులు... పయోముఖ విషకుంభాలు.'

మనిషి కళ్ళెత్తి చూశాడు. వాడు వాగుడికి ఆనకట్ట వేసుకున్నాడు. భయంభయంగా ఏదో చెప్పబోయాడు!

"తర్కిస్తే మిగలనిది సత్య మొక్కటే!" అన్నాడు మనిషి. మాలీ, మాలినీ ఏమీ అర్థంకాక వృత్తిం డాల్లా చూస్తూ ఉండిపోయారు.

పిల్లగాలికి మొక్కలన్నీ మనిషివేపు వంగుతున్నాయి. శతాబ్దాల తపస్సు ఫలించినట్లు ఆ క్షణమే ప్రణయ దేవతలు కటాక్షించినట్లు పూలన్నీ అతడిని తాకు తున్నాయి.

వాడి చేతి పూవునుండి మంచు కణంలోని శతాంశం క్రిందికి రాలింది.

దూరంగా అనంతాకాశపు టంచున ఎక్కడో తటిల్లత చటుక్కున మెరిసింది.

"నీవు కోసుకునే పూలన్నీ వివే! నేను కోసుకునే వన్నీ నావే! అయినా ఒక్క మొగ్గ పుణికినందుకే ఏమిటీ రభస?"

మాలికీ, మాలినికీ వాడు న్యాయం మాట్లాడు తున్నా డనిపించింది. మనిషికి పిచ్చెక్కినా ఉండాలి. పొగరుమోతైనా అయి ఉండాలి. అని తీర్మానించు కున్నారు. అయినా మౌనం వహించారు. వాళ్ళ మౌనం ప్రమాదానికి దారి తీస్తుందని భయపడి కాళ్ళ క్రింది మట్టి జవజవలాడిపోయింది.

దయతలచిన చల్లగాలి, మనిషి స్పర్శనిచ్చి జీవి తాన్ని సఫలం చేస్తున్న క్షణంలో అరక్షణం పూలన్నీ మాలినీ, మాలినీ తాకాయి. వారి కరకు శరీరాలపైన తొందరపడవద్దంటూ కనకాంబరాలు సులాకంగా సిల్కు గీతలు గీశాయి. ఎత్తుగా ఎదిగిన మందారం వాళ్ళ గుండెల్ని అలవోకగా తాకుతూ గుండెల్లో మమకారాన్ని తట్టి లేపుతోంది. మా సువాసనలు దౌష్ట్యాన్నీ, ప్రేమ రాహిత్యాన్నీ రూపు మాపుతాయి అనుకుని సంపెంగలు ముఖం మీద వాలి వెళ్ళి పోయాయి. మాకేంతెలీనప్పుడు నిర్మలంగా ఉండాలి— మాట్లాడ కూడదు అన్నట్లు తమ నైర్మల్యాన్ని ధావళ్యంతో గుర్తు తెచ్చి పక్కకు తప్పుకుంది మల్లెతీగ. మనిషిని నమ్మండి అంటూ, తాము చెప్తే గుర్తిస్తారనే ఆశతో, తీవ్రమైన కోరికలా ఎర్రగా కాశీరత్నాలు జలజలా రాలాయి. నిన్ను చూస్తే, నీ బరువు చూస్తే మనిషిది మండే కోరిక అనుకుంటారేమో, అపార్థం చేసుకుంటారేమోనని భయపడి, నిర్మలంగా సన్నజాజులు తుంపురుల్లా వాళ్ళమీదికి జారాయి.

మనిషి నిరుత్తరు డయాడని విజయగర్వంతో మళ్ళీ చేయి పైకెత్తి, దర్పంగా వాసన చూడ బోయాడు వాడు. కడబడుతున్న ప్రాణంతో రేపటి పూవు మరీ ముడుచుకుపోయింది.

తల లూచుకుంటూ ఉదయపు ఎండలో, పూలు కమ్మని కబుర్లు చెప్పుకుంటుంటే, లోకంలోకి పొటమరించక ముందే, తాను విన్నది—లోకం ఎంతో అందంగా ఉంటుందట. త్రిసంధ్యలూ తమను వెలిగించడం కోసమే ఉన్నాయట. గాలులన్నీ తమ సువాసనల్ని మోసుకెళ్ళేందుకే పుట్టాయట. ఎక్కువ కాలం జీవించినవి అందమైన రాత్రుల గురించి కూడా చెప్పుకోవటం కూడా విన్నది. కొన్ని రాత్రులు మంచులాంటి వెలుగు లోకాన్ని కప్పుతుందట. ఆ వెలుగులో భువి మీద ప్రాణికోటి అంతా పులకరించి పోతుందట. కొన్ని రాత్రులు కన్నుల పండుగలా నీలాకాశం మీద తారలు మెరుస్తాయట. అలాంటి రాత్రులు విశ్రబ్ధంగా ఎన్నో ప్రేమ గాథల్ని సంగీతిస్తాయట. ప్రేమించటమే బ్రతుకంటే అని మౌన సందేశాన్నిస్తాయట. తెలతెలవారుతూనే తేనె కోసం అలవోకగా, ఆర్ద్రంగా, లలిత లలితంగా కొందరూ, బండతనంగా కొందరూ ఎండలో బయల్దేరుతారట. ఉదయపు ఎండలో సర్వప్రాణికోటీ శక్తివంతమై ఉండేవేళ తేనెకోసం వచ్చి మృదువుగా స్పృశిస్తూ తమపైన బరువు పడకుండా వాటి తేనె జుర్రుకుంటారట. మకరందం కోసం వేటలో ఒకోసారి రెక్కల్ని నొక్కి పట్టి దూరంగా జరిపేసి, అలాగే బలిమిని తొక్కిపట్టి తేనెలు పీలుస్తారట. అయినా బాధ అనిపించదట. భయంవేసినా ఆనందంనిండిపోయి బతుకు చాలించా

లనిపిస్తుందట. అలాగే కళ్ళు మాయాలనిపిస్తుందట!

బలంగా రెక్కల్ని విడదీసి తొక్కిపట్టి తేనె పీలుస్తుంటే ఆనందంగా ఎలా ఉంటుందో అర్థంకాలేదు తనకు.

సున్నితంగా, మృదువుగా ఉండే స్పర్శ ... ఆ అనుభవం నా కొస్తే ఎంత బాగుండును! మనిషి దగ్గరైతే అదే అనుభవం కాబోలు. దాన్నే కోరుకుంటే వీడు, రాక్షసుడు, తనను ఇంకా కలలన్నా కనకుండానే తుంపేశాడు!


బాధగా చెమర్చింది!

మనిషి తనను రోజూ గమనించేవాడు. చివురాకుల మధ్య ఆకుపచ్చదనం మధ్య సృష్ట్యాది చీకటిని చీల్చుకుని బయటకు వచ్చే ప్రయత్నం తనకు తెలియకుండానే తాను చేస్తున్నప్పుడు, లేదా ప్రకృతి నియంత్రించి చేయిస్తున్నప్పుడు, లోకంలోకి కళ్ళు తెరుస్తానవే జ్ఞానంకాక సార్వకాలికమైన సర్వప్రాణ కోటికీ సత్యమైన ప్రకృతి పులకింతలాంటి జన్మ తనకు వస్తున్నదని తనకే తెలియనప్పుడు కూడా మనిషి ప్రేమగా, ఆర్ద్రంగా, దయగా, నులివెచ్చగా చూసేవాడు. ఆ నులివెచ్చని చూపులో తన ఆవిర్భావపు వేడి కలిసిపోయి శరీరమంతా గగుర్పొడిచి నట్టయ్యేది. అంగాంగాలూ పులకించి బట్టబయలు చేస్తుంటే, స్పృశించకుండా కళ్ళతోనే అతను తనలో ఏదో వెలుగు నింపేవాడు. ఆ వెలుగు తనలో నిండుతున్నకొద్దీ తన రూపం స్పష్టమై ఎదుగుతూ పోయింది. ఆ వెలుగు తన అణువణువుపై విద్యుత్తులా నింపేది. ఆ ప్రతి చూపులోనూ 'నీవు నా దానవు' అంటూ ఒక సందేశం శాంతి కిరణంలా, ప్రేమ గీతంలా తన కణాల్లోకి చొచ్చుకుపోయేది. అలా అతడి ప్రేమ మనోసరస్సులో, దయా జలపాతాల్లో కాంతి తరంగాల్లా తాను, కళ్ళు తెరవకనే అంతరాంతరాల్లో అతని స్పర్శను ఊహించి అనుభవిస్తూ పెరిగింది.

పూర్తిగా వెలుగొస్తే—విచ్చి, తన మకరందాన్ని, సౌరభాల్ని వెదజల్లే క్షణం వస్తే అతడికే ఇవన్నీ ఇవ్వాలి. మనిషికే తాను చెందాలి. తను ప్రకృతి. అతడు పురుషుడు. అతడి అమృత స్పర్శలో జీవన సాఫల్య మధువు గ్రోలి, ఆ తన్మయత్వంలో ప్రేమ తరంగాలు కణకణాలకూ పాకి అంగాంగానికి సోకి విహ్వలయ్యేనప్పుడు కన్నుమూయాలి.

అతడెంత ఉన్నతుడో! విశాల విశ్వంలోకి తానింకా పొటమరించక ముందే సునునేతదనం తప్ప ఏ అందమూ తాను సంతరించుకోకముందే, అతడి చూపుల ప్రేమ పుంజాలకోసం, స్పర్శకోసం తెలియక తహతహలాడుతుంటే, తనను తాకకుండా, సృష్ట్యాది నుంచీ జీవకోటికి ఉన్న అంతశ్శక్తితో ఉద్రేకాన్ని, ఉద్వేగాన్ని తగ్గించేవాడు.

ఈ లోకంలోకి మొగ్గవై వచ్చి, విచ్చి, నీ రంగు రంగుల అందాలతో, పరిమళాలతో ప్రకృతిని నింపి ఒక సౌందర్యాతపత్రాలలో లోకాన్ని ముంచెత్తుతావు. ఆ నాటికి నీ కోరికలు మారతాయి. స్వర్గానుభూతిని ఘనీభవింప చేసి, నీతో దాచుకుని తృప్తితో నిండిపోతావు. ఆనందానుభూతుల చరమావస్థను




హిమవన్నగాల సదృశమైన అనుభవాల ఎత్తుల్ని అనేక అనుభవాల జలధుల లోతుల్ని ఏకీకృతం చేసి అంతర్ముఖత్వాన్ని సాధించి, అనుభవమే నీవై పోయి, వాటికి బహుళిక రూపం ఇచ్చి నిన్ను నీవు విశ్వవ్యాపి చేసుకునేందుకు కాయవై పండువై పోతావు.

అంతటినీ దూరం చేయమంటావా ? అమాయకురాలా! వచ్చే కాలమంతా నీదే! తొందర పడకు అంటూ మధుర సందేశ జ్వాలాతరంగాలను ప్రసరింప జేసేవాడు. ఎన్ని కలలు కన్నది?

కలలు కల్లలౌతాయని తెలియనే తెలియదు. జీవితం మంటలా ముగుస్తుందేమో నన్న అనుమానం కూడా రాలేదు. అందరిలా తానూ రేకులు విప్పుతానని అనుకుంది కానీ, ఎవరో అర్థాంతరంగా కర్కశంగా దారుణంగా, అమానుషంగా, భయంకరంగా, అర్థరహితంగా సమస్త న్యాయాలనూ కాల రాసి నాశనం చేస్తారనిఅనుకోనేలేదు. ప్రేమగా సాకిన మాలీ మాలినీ నిర్దాక్షిణ్యంగా తనవలపు తలపులను, తీయతేనియలను, సువాసనలను దానవుడికి దానం చేసి, దైవత్వానికి తనను దూరం చేస్తారని అనుకోలేదు.

పాదులు చేస్తూ, నీళ్ళు పోస్తూ ఏవో చెప్పుకునే వారు. కోసిన వాడిదే పువ్వు అనుకుంటుండే వారు. అవసరమైతే తామే కోసి ఎవరికో ఒకరికి ఇచ్చేయటం న్యాయం అనుకునే వారు. పూవయ్యాక ఎవరికీ ఇవ్వక రాలిపోనివ్వటం న్యాయం కాదనుకుంటుండే వారు. అతా తెలిసినట్లే.

ఈ వేళ వాడి చేతిలో నలిగిన నిండిన కర్కశ హస్తాల పంకిలంతిప్పంటి, కడుపు చెరువవుతూంటే అనిపిస్తున్నది—మాలికీ, మాలినికీ ఏమీ తెలియదు.

ప్రకృతికి ధర్మం ఉంటుంది కానీ, న్యాయం ఏమిటి? తను ప్రకృతి కాదా? తనకు ధర్మమే ఉంటుంది కానీ,న్యాయాలూ చట్టాలూ ఉంటాయా? మరి తన ధర్మాన్ని నిర్వహించకుండా అడ్డు పడతారేం? మాలీ, మాలినీ మూర్ఖులు. వాడూ మూర్ఖుడే. ఈ బాధామయ గాథనంతా పరికిస్తూ ఉన్న తోట, సర్వసాక్షి. కుమ్మ తెమ్మెర అంతా జడులు! అడుకోని, ఆదుకోలేని అసమర్థులు!

వాడు... మనిషి కళ్ళల్లోకి చూస్తూ మళ్ళీ చేయి పైకెత్తబోతున్నాడు. సూకరం సంపెంగను వాసన చూసినట్లు. తనను మళ్ళీ వాసన చూడాలనుకుంటున్నాడు కాబోలు. ఒళ్ళంతా చీదరతో, అసహ్యంతో నిండిపోయింది. కనీసం ఏ పసి పిల్లల చేతులో నలిగినా బాగుండి పోయేది. చిదిమి విసిరేసే వాళ్ళు! వాళ్ళ మృదు హస్తాలతో చిదిమేసినా ఆ నైర్మల్యపు చేతుల్లో బాధ కలగదు. అలా అని గులాబీలు చెప్పుకుంటుంటే వినపడింది.

దయామయుడు, ప్రేమమూర్తి ఆర్తి నిండిన గొంతుతో అవాంతరాన్ని అడ్డుకున్నాడు.

"పోనీ! ఆ మొగ్గను ఒకసారి నా కివ్వు!" అన్నాడు. వాడు మనిషి కళ్ళల్లోకి చూశాడు. ఎందుకో వాడికి భయం వేసింది.

ఇవ్వను—అందామనుకున్నాడు. అంతలోకే నక్క తెలివి ఉపయోగించి—"వాసన చూసిన పువ్వు గద! అనాఘ్రాత పుష్పా న్నివ్వలేవు?" అన్నాడు.


మనిషి అందుకోడేమోనని పువ్వు దిగులు గుండెల్నిండా పేరుకుంది. అందుకోడన్న భయంతో, ఆందోళనతో, అనుమానంతో. తాను చేయని తప్పుకి మనిషి తనని నిందించడన్నదికూడా తట్ట లేదు. అవును. వాడు చూశాడు కానీ, తాను సుగంధం అందించలేదుగా! ఆ సూకరానికా తాను గంధాలను, మనోసుగంధాలను అందించేది? అయినా అత డేమంటాడోనని బెరుకు బెరుగ్గా చూస్తున్నది.

అతడి ముఖాన చిన్న చిరునవ్వు వెలిసింది. ఎంతో ఆనందమైంది తనకు. అతడి చిరునవ్వు చల్లని సూర్యోదయంలా, నులి వెచ్చని చంద్రోదయంలా వెలుగులు చిమ్ముతూంది. పులకించి పోయిన పూవు లలితాంగాలు అంతలోనే పిరికి ప్రకంపనాల్ని అందుకున్నాయి. వాడు... వాడెందుకో అతడి చిరునవ్వుకి భయపడి వణుకుతున్నాడు: విషపు నవ్వులు నవ్వి, వాటిని రాళ్ళను చేసి రువ్వి మనసుతో నవ్వటం మరిచిన వాడు వాడు. అందుకే స్వచ్ఛంగా హృదయపు లోతుల్నించి వచ్చే చిరునవ్వులు వాడికి భయాన్ని కలిగిస్తాయి.

"నా మొగ్గని, నా రేపటి పూవుని నా కిచ్చెయ్" అని మవునంగా శాసిస్తున్నట్లున్నాయి మనిషి కళ్ళు.

వాడు తిరిగి పూల పెట్టాడు—

"వాసన చూసిన పువ్వు గదా!"




మనిషి కోపాన్నణచు కున్నాడు. అది అతడి దేహం అంతా పాకి జ్వలిస్తూంది. అయినా మనిషి గదా? ఇంకా వాడు మేలుకుంటాడని కాబోలు!

"మూర్ఖుడా! ఈ తోటలోకి నిన్ను రానివ్వటమే మాలీ, మాలినీచేసిన పెద్ద తప్పు! నీకు పట్టుకోవటమే తెలియదు! నీ స్పర్శకు విడివడే మొగ్గలన్నీ ముకుళించుకు పోతాయి. వడగాలికి కమిలినట్లు వాడిపోయి రాలిపోతాయి. పూలు నీకు గంధాల్ని అందించవు. వాటికి సంస్కారం ఉంది. తెగించి చెప్పే సాహసమూ అవకాశమే లేదు. ఆ విషయం కనుక్కోవలసిన మాలీ, మాలినీ వాటి మాటలు వినరు. అందుకే తెలుసుకో. నీవు పశుతుల్యుడివి. ప్రాణి ఆరాటం తెలియదు. ప్రకృతి తపోవిఘ్నం నీ కర్తవ్యం కాదు. తేజోమయమైన లోకంలో ప్రేమను పుష్పించే జీవజాలపు అనాది సనాతన ధర్మం నీ స్పృహలోకి రాదు.

అది స్పృహ లోనికి రాని చేతుల్లో పూలు రాణించవు. వాటి రంగులకు నీవు గుడ్డి వాడవు. వాటి సుగంధాలు నీకు తెలియవు. స్పర్శ మాత్రాన కలిగే వాటి పులకింతలు నీ దళసరి చర్మానికి తెలియవు. ఆ పూల పులకింతల సంగీతం వినిపించని బధిరుడవు! పైగా లోకంలో భేషజంతో, విషపు నాగరికతతో బతకటం నేర్చిన వాడవు. అందుకే నీ స్పర్శ పూల పాలిట మృత్యుహేల! ఇలాతే...అది నా బాధ!"

ఆ మాటలకు వాడి చేతుల కరాళ స్పర్శనుకూడా మరిచి, జీవన తేజోస్రవంతి అంతరిస్తున్నదనికూడా మరిచి, అమందానందంతో, ఆత్మికానందపు జ్ఞాన పరిధుల్లో ఊగింది. అతడి కంఠంలో ఏవేవో లోకాలు తారస్థాయిలో సంగీతిస్తున్నాయి.

అతడి కోపం ఇంత మధురంగా ఉంటుందా? మరి వాడు అలా చేపకుతాడే అనుకుంది పిచ్చి పువ్వు! అంతలోనే అంతరాళంలో ఎక్కడో ఏదో మూలుగు.

ఏది ఏమైనా కోసుకున్న వాడికే తాను చెందాలి అని విధి నిర్ణయం కాదా?' అని మూలుగు. తనలో నించే, తన కణాల్లో నించే ఈ ప్రశ్న వచ్చినందుకి విభ్రాంతి చెందింది. మనిషి లోకి స్పర్శానుహితంగానే ఆవేదనా తరంగాలు ప్రవహించాయి. అతడు చల్లగా చూశాడు. ఆ చల్లని చూపు స్పష్టమైన సందేశాన్నిచ్చింది.

"భయపడకు! మాలీ, మాలినీ పోసిన నీరుతాగావు కదా! అందుకే అలాంటి ఆలోచనలు వస్తున్నాయి. పాపం వాళ్ళను శపించకు! ఆ జీవులు అంతే! వారికి భౌతిక వికసనమే గానీ, మానసిక వికాసం ఉండదు."

క్షీణిస్తున్న ఆశను, ప్రాణాన్ని ఒక్కసారిగా జ్వలింప జేసిం దా సందేశం!

వాడు మొండివాడు! సాఫల్యం ఎరక్క బతుకును పట్టుకు వేళ్ళాడే అల్పజీవి. అందుకే వదలడు. తన కక్కుర లేకపోయినా వదలడు. తీగలా సాగుతాడు.

"నాకు వాసనతెలిసింది. రంగులూ కనిపించాయి." అన్నాడు. నిర్వేదం చిరునవ్వయి అతడి ముఖాన ఆర్ద్రంగా వెలిగింది. వాడి చేతనున్న పూవుకి మనిషి చిరునవ్వు కన్నీళ్ళ కుండలను కడుపులో దాచిన అనుభూతి కలిగించింది. తాను చివరి ఘడియ లోనైనా దక్కానని అనుకుంటున్నాడా? నిరాశ పడుతున్నాడా అనిపించింది.

"నీకు తెలిసిందనుకోవటమే భ్రమ. నేనూ అలాగే కామించి ప్రేమించాననుకున్నాను. రాగోదయం అమూక ప్రేమలోనే మిగిలిపోయావు! నీకు తెలీదు. ఇలాతే! రాగో ( జ్ఞాన ) దయమే కాలేదు నీకు ప్రేమోదయం ఎలా అవుతుంది! ఇలాతే! కోరిక ప్రేమ కాదు! ఇలాతే! ఇలాతే! ఇ.లా. తే. ఇ. లా.తే!"

అతడి కేకకు భూమ్యాకాశాలు దద్దరిల్లాయి. శూన్యాకాశం. ఇ. లా.తే అంటూ ప్రతిధ్వనించింది. నిర్గుణుణ్ణి, నిరాకారుణ్ణి మేల్కొలిపింది. సప్తసముద్రాలలోనూ ఉవ్వెత్తున అలలులేచి భూమిని కబళింప చూశాయి. ప్రచండ ఝంఝుమా యావత్ సృష్టినీ కుదిపేసింది. రవిచంద్రులు ఒక్కమారుగా జ్వలించి మరుక్షణమే అనంతమైన చీకటి ఆవరించింది. నవనాదభరితమైన ప్రశాంతి చోటు చేసుకుంది.

మనిషి పడిపోయాడు. 'వాడు' ఉన్న భౌతిక చైతన్యాన్నికూడా కోల్పోయి చేష్ట లుడిగి చూస్తున్నాడు.

పువ్వు. ఆ రేపటి పువ్వు. ఎవరికీ వినిపించని భయంకరమైన ఆర్తనాదాన్ని శూన్యంలోకి, దిగంతాల్లోకి స్పందనలుగా ప్రసారం చేసింది.

నిరాకారుణ్ణి,నిర్గుణుణ్ణి రోదిస్తూ ప్రార్థించింది.

"ప్రభూ! నేను ప్రకృతిని కానా? స్త్రీని కానా? శక్తిని కానా? శక్తి స్వరూపిణి కానా? అద్యంతాలు లేని ఆనందాన్ని కానా? నీ వెలుగులో భాగాన్ని కానా? నీ కాలంలో ఒక క్షణాన్ని కానా? నీ నిశ్శబ్దంలో నిశ్శబ్దాన్నీ,శబ్దంలకి శబ్దాన్నీ, ఓంకారంలోని శ్రుతినీ శ్రుతి అవతారాన్నీ కావా? అయితే. అన్నీ నేనే అయితే. లేక అందులో ఒక్కటైనా సరే. నా కోసం తపించిన అతణ్ణి కాపాడు. రక్షించు! కన్ను మూసినా కనిపించే వెలుగులోకి, తేజస్సులోకి, బధిరులకైనా వినిపించే నిశ్శబ్ద సంకేతంలోకి అతణ్ణి తీసుకో! ప్రభూ... ప్రభూ! ప్రభూ అని ప్రార్థించింది. వేడుకున్నది.

సర్వసాక్షి దయపద్దాడు. పంచభూతాలూ ఏక రూపమై జీవజలమై ప్రాణవాయువై వ్యాకోచించి వెలుగై సంకోచించి చీకటై.

మాలీ, మాలినీ 'బాబూ. బాబూ. అంటూ ఆర్ద్రంగా అతణ్ణి నిమిరారు.

"ఆ మొగ్గ కోసం ఇంతవుతుందనుకుంటే కోయనివ్వక పోదుం" అన్నారు వాడి వంక చూస్తూ.

ఇతరుల్ని హింసించటంలో ఆనందం పొందే వాడి లాగా నాచు నవ్వాడు. మనిషిలో చైతన్యం అంతరించి పోతే బాగుండు ననుకుంటూ చూస్తున్నాడు.

మనిషికి కొన్ని క్షణంలో యుగాలు. పువ్వుకి కొన్ని సౌభాగ్యపు మన్వంతరాలు గడిచాయి. అతడు లేడు.

సౌమ్యంగా శ్రుతిస్తున్న వాయులీనంలా మరలా "ఇలా తే!" అన్నాడు.

వాడువోడిపోయాడు. అతడికి అందించ బోయాడు అరచేతిని తెరచి మృదువుగా అందుకున్నాడు.

బతుకుపాశ ఫలించిన ఆ పూవు అతడి కరకమలపు వెన్నెల్లో ధావళ్యమై బలవత్తరమైన విద్యుత్సరాల చివర్లలో నిండుకున్న ఉద్వేగమై ఉగ్గిగ్ధ రక్త ప్రవాహమై అతని చేతి అనుణియై తన్మయించింది.

మాలి, మాలినీ, వాడూ, తోటా, సర్వసాక్షీ, నిశ్శబ్దం అన్నీ చూస్తూనే ఉన్నాయి.

ఆ పూవు లలితంగా పరుస్తున్న అరచేతినిలాలనగా ప్రేమగా, మృదువుగా, తన పూపిరి గట్టిగా తగిలితే ఏమవుతుందో నన్నంత జాగ్రత్తగా, అలవోకగా మోము దగ్గరగా తీసుకున్నాడు.

జీవన సాఫల్యాన్నంతా నింపుకుని అతడికి సౌరభాల్ని అందించిం దా పువ్వు.

కనులంతా తేజోమయమై, మధుర సంగీత స్రోతస్విని లోకాన్ని ముంచెత్తుతూంది.

రెండు వెలుగులు ఏకమై, చీకట్లో కాక మరింత వెలుగులో ఆ స్రోతస్వినితో నీలి శూన్యంలో లయించాయి.

ఆ వెలుగుల కలయిక మరో లోకంలోకి మరో జన్మ లోకి కళ్ళు తెరిచింది. ✱